ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024





పాస్‌ల కోసం ఆర్డీటీ స్టేడియం బయటకు వేచి ఉన్న క్రికెట్ అభిమానులు

అందరి చూపు.. ఆస్థలం వైపు..!

హిందూపురం నియోజక వర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజక వర్గం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బామ్మర్ధి నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సారి బాలయ్య ఇలాఖలో అధికార పార్టీకి చెందిన కొంత మంది అధికారాన్ని అడ్డు పెట్టుకుని కబ్జాల పర్వాన్ని ప్రారంభించారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.


◆ రాత్రికి రాత్రే పాల రైతుల కో ఆపరేటివ్ సొసైటీ భవనం కూల్చివేత

◆ బాలయ్య ఇలాఖాలో కబ్జాల యత్నం..?



కూల్చివేయడంతో భవనం శిథిలాలు





భవనంలో ఉన్న అప్పటి రికార్డులు



తమకు స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారికి వినతిని ఇస్తున్న వీర శైవ సంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మెయిన్ బజారులో సుమారు రూ.2 కోట్ల విలువజేసే పాల రైతుల కో ఆపరేటివ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్‌కు చెందిన భవనాన్ని మూడు రోజుల క్రితం రాత్రికిరాత్రే కూల్చివేశారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతల హస్తం ఉందనే ప్రచారం జోరుగా విన్పిస్తోంది. ప్రస్తుతం భవనం కూల్చి వేయడంతో అక్కడ ఖాళీ స్థలం కన్పిస్తోంది. దీంతో అందరి చూపు ఆ ఖాళీ స్థలంపైనే పడింది. ఆ స్థలాన్ని ఆలయ అభివృద్ధికి కేటాయించాలని వీర శైవ సంఘం వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. తమ స్థలంలో ఉన్న భవనాన్ని కూల్చి, అందులో ఉన్న పాల కూలింగ్ మిషన్, సేఫ్టీ లాకర్, అల్యూమినియం పాల క్యాన్‌లు ఎత్తుకొని పోయారంటూ పాల రైతులు పోలీసు స్టేషన్, రెవెన్యూ, ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఇక అధికార పార్టీ నేతలు స్థలాన్ని కబ్జా చేసేందుకు వారి ప్రయత్నాల్లో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఎవరికి వారు ఈ స్థలాన్ని వారి గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో హిందూపురం పట్టణంలో ఈ స్థలం అంశంపై అందరి నోట్లోనానుతోంది.

హిందూపురం పట్టణ సమీపంలో ఉన్న సుగూరు, సడ్లపల్లి, పోచనపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు వారు ఉత్పత్తి చేసిన పాలను పట్టణానికి తీసుకొచ్చి విక్రయించే వారు. పాడి రైతులందరూ కలిసి హిందూపూర్ కో ఆపరేటివ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్‌గా ఏర్పడి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాటు యూనియన్‌లో ఉన్న రైతులు అందరూ చేరి ఆ సమయంలో మెయిన్ బజారులో ఓ ప్రయివేటు వ్యక్తి నుంచి స్థలాన్ని కొనుగోలు చేసుకుని, భవన నిర్మాణం చేసకున్నారు. తర్వాత అక్కడి నుంచి హిందూపురం పట్టణ వ్యాప్తంగా పాలను అందిస్తుండేవారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో రైతులు పాలను గ్రామాల్లో ప్రవేటు డెయిరీకే విక్రయించడం మొదలైంది. దీంతో రైతులు ఏర్పాటు చేసుకున్న కో ఆపరేటివ్ యూనియన్ భవనంలో క్రయ విక్రయాలు నిలచిపోయాయి. ఆ భవనం సంవత్సరాలుగా మూతపడింది. పాల క్యాన్‌లతో పాటు యూనియన్‌కు సంబంధించిన రికార్టులు అన్నీ ఆ భవనంలోనే ఉన్నాయి.

బాలయ్య ఇలాఖాలో కబ్జాలు..?

బాలయ్య ఇలాఖలో గతంలో ఎప్పుడులు లేని విధంగా పురంలో కబ్జాల పర్వం ప్రారంభం అయిందనే వాదన ఇటీవల విన్పిస్తోంది. పాల భవనం కూల్చివేత విషయం బాలయ్య దృష్టికి వెళ్లిందా....? ఆయనకు తెలియకుండా స్థానిక అధికార పార్టీ నాయకులు కబ్జాకు యత్నిస్తున్నారా...? అన్న విషయాలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. ఈ భవనం కూల్చివేత, కబ్జాకు యత్నంపై ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించి వాస్తవాలు బహిర్గతం అయ్యేలా చూడాలని పట్టవాసులు కోరుతున్నారు.

అధికార పార్టీ నేత పనేనా..?

175 మంది పాల రైతులతో ఏర్పడిన హిందూపూర్ కో ఆపరేటీవ్ మిల్క్ సప్లయ్ యూనియన్ లిమిటెడ్ భవనంపై అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య వ్యక్తి కన్ను పడినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మున్సిపల్ ఖాళీ స్థలాలపై సైతం అధికార పార్టీ నాయకులు కన్నేశారు. ముందుగా పాల రైతుల కోపరేటివ్ యూనియన్ భవనానికి సంబంధించి రైతులందరూ గ్రామాల్లో ఉన్నారని, ప్రస్తుతం పాలక వర్గం సైతం లేక పోవడం తదితర అంశాలతో పాటు ఈ భవనంకు దిక్కు ఎవరూ లేరని గుర్తించి కొంతమంది అధికార పార్టీ నాయకుల కన్ను ఆ భవనంపై పడింది. వారికి వినయక పండుగ కలిసి వచ్చింది. పండుగ సమయంలో ఎవరూ పట్టించు కోరని భవనాన్ని రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా కూల్చివేశారు. ఆ తర్వాత స్థలాన్ని కబ్జా చేసేలా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. మున్సిపాల్టీలో ఏదైనా భవనం కూల్చలంటే పాలక వర్గం, అధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాల్సి ఉంది. పాల భవనం కూల్చివేతలో ఎలాంటి అనుమతలూ తీసుకోలేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని ఎవరు కూల్చారన్న దానిపై పట్టణంలో పెద్ద చర్చ నడుస్తోంది. దీని వెనుక అధికార పార్టీ నేత హస్తం ఉందనే వాదన మాత్రం బలంగా ఉంది. కోట్లు విలువ చేసే భూమిని దక్కించుకోవడానికి సదరు నేత అన్ని మార్గాలను అన్వేషించి ఈ కూల్చివేతకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

పాసుల కోసం పడిగాపులు..!

◆ రెండవ మ్యాచ్‌లోనైనా సరిచేసేరా..?
◆ రేపటి నుంచి దులీప్‌ట్రోఫీ రెండు మ్యాచ్‌లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

క్రికెట్ జాతీయ స్థాయి అగ్రశ్రేణి టోర్నమెంట్‌లో దులీప్ ట్రోఫీ ఒకటి. ఇంతటి గొప్ప టోర్నమెంటు తొలిసారిగా అనంతపురం జిల్లాలో జరుగుతోంది. అగ్రశ్రేణి ఆటగాళ్ల అందరూ ఇక్కడికి విచ్చేశారు. ఈనెల 5న టోర్నీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే ఒక మ్యాచ్ పూర్తయ్యింది. రెండో మ్యాచ్ ఈనెల 12వ తేది నుంచి ప్రారంభం కానుంది. టోర్నీలో ఇక నుంచి రెండు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో ఒక మ్యాచ్‌కు మాత్రమే ప్రేక్షకులకు అనుమతి ఉంది. రెండోగ్రౌండ్‌లో స్టాండ్స్‌లేవు. దీంతో ప్రేక్షకులకు అనుమతి లేదు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ ప్రధాన మైదానంలోనే స్టాండ్స్ ఉన్నాయి. ఇక్కడ నాలుగు వేల మంది వరకు కూర్చోని చూడటానికి అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇందుకు తగ్గట్టుగానే పాసులు ఉచితంగా ఇస్తున్నట్టు చెబుతున్నారు.

వీక్షకులు తక్కువ... పాసుల కోసం ఎదురుచూసేవారెక్కువ..!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎక్కువగా ఉన్నారు. అగ్రశ్రేణి ఆటగాళ్ల అందరూ వచ్చినందున నేరుగా మ్యాచ్ చూడొచ్చునని ఆశపడ్డారు. దీంతోపాటు ఉచితంగా పాసులిస్తుండడంతో యువత ఎక్కువగా ఉత్సహం చూపారు. మొదటి మ్యాచ్ ప్రారంభానికి రెండు రోజుల ముందు పంపిణీ చేస్తున్నట్టు డీఎస్పీ శివారెడ్డి చేత ప్రారంభించారు. కొన్ని పంపిణీ చేసి తరువాత నిలిపివేశారు. ఇక ముఖ్యమైన వారికి నేరుగా పాసులు అందజేశారు. ఈ పాసులు ఎవరెవరికి పంపిణీ చేసారో తెలియని పరిస్థితి ఉందని జిల్లా క్రికెట్ సంఘం నేతలు చెబుతుండటం గమనార్హం. తమకు కూడా ఐదుకు మించి పాసులివ్వలేదని, ఎవరి వద్దనున్నాయో తెలియదని అంటున్నారు. 12వ తేదీ జరిగే మ్యాచ్‌లకు కూడా పాసులు పంపిణీ చేస్తారని ప్రచారం జరుగడంతో మంగళవారం ఉదయం పెద్దఎత్తున అభిమానులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఎంతసేపు వేచి ఉన్నా ఇస్తారో లేదో చెప్పేవారు లేక నిరాశతో అభిమానులు వెనుదిరిగారు. ఓ వైపు పాసులన్నీ ఇచ్చేశామని నిర్వాహకులు చెబుతున్నా మైదానంలో మాత్రం వీక్షకులు తక్కువగానే కన్పిస్తున్నారు. మరి వారు ఇచ్చామని చెబుతున్న పాసులు ఎక్కిడికి వెళ్లాయన్నదే ఇప్పుడు క్రికెట్ అభిమానుల మదిలో మెదులుతున్న ప్రశ్న.

తరువాతి మ్యాచ్‌లకైనా లోటుపాట్లు సరిచేసేరా..?

టోర్నీలో భాగంగా పలు ఇబ్బందులు మొదటి మ్యాచ్‌లో చోటు చేసుకున్నాయి. వీటి నుంచి గుణపాఠం నేర్చుకుని తరువాత జరిగే రెండు మ్యాచ్‌లకైనా సరిచేస్తారా లేదా అన్న దానిపై చర్చ నడుస్తోంది. మొదటి మ్యాచ్‌లో పాస్‌ల జారీ, వివిఐపిలకు కేటాయింపు, భోజనాల విషయంలో విమర్శలొచ్చాయి. తినుబండారుల విషయంలోనూ ధరలు అధికంగానున్నాయన్న ఆరోపణలున్నాయి. రాబోయే మ్యాచ్‌ల సమయానికైనా వీటిని సరిచేసే ప్రయత్నం నిర్వాహకులు చేస్తారన్నది చూడాల్సి ఉంది.

ఆటగాళ్ల ముమ్మర సాధన..!

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ కోసం ఇండియా ఏ, బీ, సీ, డీ జట్టు సభ్యులు జోరుగా సాధన కొనసాగించారు. మంగళవారం స్థానిక ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ఇండియా ఏ జట్టుకు చెందిన మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ఎస్.కె.రషీద్, తిలక్ వర్మ, శివందుబే, ఇండియా బి జట్టుకు నుంచి అభిమన్యు, ఈశ్వరన్, రింకూ సింగ్, నవదీప్ సైనీ, వాషింగ్‌టన్ సుందర్, ముఖేష్‌తో పాటు ఇండియా సీ, డీ జట్టు ఆటగాళ్ల సాధన చేశారు. మైదానంలో కసరత్తు చేసిన తర్వాత.. నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. రెండో రౌండ్ పోటీలు రెండు మైదానాల్లో నిర్వహించనున్న దష్ట్యా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన స్టేడియాన్ని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.



ఆర్డీటీ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న ఆటగాళ్లు



లలితా మెగా మాల్‌లో ఎగిసిపడుతున్న మంటలు

తాడిపత్రిలో భారీ అగ్ని ప్రమాదం

◆ లలిత మెగా మాల్‌లో మంటలు ◆ రూ.2 కోట్లకు పైగా నష్టం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణం నడిబొడ్డులోని లలిత మెగా మాల్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వినాయకుని మండపాల వద్ద యువత, ప్రజలు ఉత్సాహంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా షాపింగ్ మాల్‌లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించగానే స్థానికులు నిర్వాహకులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన రెండు ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మంగళవారం ఉదయం 9 గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ జనార్ధన్ నాయుడు, జిల్లా ఫైర్ ఆఫీసర్‌తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. ప్రమాదంలో దాదాపు రూ.రెండు కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇటీవల తాడిపత్రిలో రాజకీయ ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఉన్న ఫలంగా అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో భయాందోళన పరిస్థితి నెలకొంది. కొంతసేపటి తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో లలితా మెగామాల్‌లో అగ్ని ప్రమాదం జరిగిందనే విషయం తెలియడంతో పట్టణవాసులు ఊపిరి పీల్చుకున్నారు. తాడిపత్రి పట్టణంలో గత పది సంవత్సరాలుగా లలితా మెగామాల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో 30 మందికి పైగా ఉపాధిని కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించే సంస్థగా గుర్తింపు పొందింది. ఇలాంటి మాల్‌లో ప్రమాదం చోటు చేసుకుని పూర్తిగా తగలబడిపోవడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీగా తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటలకే ఖాళీగా దర్శనిమిచ్చింది. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరమణ తప్ప ఏ ఒక్క ఉద్యోగి కూడా లేరు. దీంతో వివిధ పనుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయా గ్రామాల ప్రజలు నిరాశతో వెనుతిరిగిపోయారు. ఈరోజు కార్యాలయానికి సెలవా అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంపై కంప్యూటర్ ఆపరేటర్‌ను ఆరా తీయగా తహశీల్దార్, డిటి, జూనియర్ అసిస్టెంట్, సర్వే డిటి, ఇద్దరు వీఆర్వోలు వరద బాధితుల సహాయక చర్యలకు విజయవాడకు వెళ్లారని తెలిపారు.



ఖాళీగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం

పండుగపూటా పస్తులే...

ప్రజాశక్తి - హిందూపురం

పాలకుల నిర్లక్ష్యం కారణంగా తమ సమస్యలు పరిష్కారం కాకపోవటంతో పండుగపూట కూడా పస్తులు ఉన్నామని తాగునీటి పథకం కార్మికులు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని, బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్ నిధులు చెల్లించాలన్న డిమాండ్‌తో శ్రీరామి రెడ్డి గ్రామీణ నీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఆరవ రోజుకు చేరింది. మంగళవారం చౌడేశ్వరి కాలనీ వద్ద ఉన్న ఆర్ డబ్యూ ఎస్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెకు సిఐటియు నాయకులు రాము మద్దతు పలికారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతు శ్రీ రామిరెడ్డి, శ్రీ సత్య సాయి గ్రామీణ నీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రతి నెల వారికి చెల్లించాల్సిన వేతనాలను చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో పండుగ పూట సైతం కార్మికులు పస్తులు ఉండాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. పిల్లల చదువులకు, హాస్పిటల్ ఖర్చులకు, కుటుంబాలు గడవడమే ఇబ్బందికరంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, గిరిష్, శివకుమార్, మహానంద్, ఎల్లప్ప, హనుమంతు, జబివుల్లా, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల నిరసన

అర్ధనగ్న ప్రదర్శన

పుట్టపర్తి అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్యసాయి త్రాగునీటి సరఫరా కార్మికులు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో గల పంపు హౌస్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. పెండింగ్ లో ఉన్న ఆరు నెలల వేతన బకాయిలు, పిఎఫ్, ఇఎస్ ఐ అమలు చేయాలని కార్మికులు ఈసందర్భంగా నినాదాలు ఇచ్చారు. వీరి నిరసన దీక్షకు స్వచ్ఛ భారత్, సిఐటియు జిల్లా కార్యదర్శి పెనుకొండ రమేష్ మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఆరవ రోజుకు చేరుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. చేసిన పనికి వేతనాలు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే అన్ని ప్రజా సంఘాలు ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, తాగునీటి సరఫరా కార్మికుల యూనియన్ నాయకులు రమేష్, మధు, ప్రభు, వెంకటేష్, శ్రీనివాస్, సత్యం, రఘు, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో సత్యసాయి కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అనురాధ మంగళవారం తెలిపారు. కళాశాలలో హిందీ అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంఎఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈనెల 12న ఉదయం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు తమ బయోడేటా తో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో జతచేసి హాజరు కావాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పెనుకొండ టౌన్ : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి లో వై జంక్షన్ వద్ద ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు,మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. టీడీపీ నాయకులు మాధవ నాయుడు,నాగలూరు నారాయణ స్వామి, పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, పెనుకొండ సీఐ రాఘవన్, ఎస్ఐ రాజేష్‌తో కలసి పరిశీలించారు. స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారిణి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సంక్షేమ వసతి గహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని ఈ విషయంతో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డిబిసి జిల్లా డిబీసిడబ్ల్యూఒ నిర్మల జ్యోతి స్పష్టం చేశారు. కదిరి డివిజన్లోని వసతిగృహాలపై ప్రజాశక్తి దినపత్రికలో అర్థాకలితో హాస్టల్ విద్యార్థులు శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వెనుకబడిన వర్గాల వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారిని నిర్మల జ్యోతి స్పందించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కదిరి పట్టణంలోని బిసి సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో నెలకొన్న సమస్యలు మౌలిక వసతులపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యార్థులకు సరిపడా బాత్రూములు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో బిల్డింగ్ యజమానితో మాట్లాడి వారంలోపు సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేసిందని ఇక్కడ విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు మూడు పూటలా పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు. కొన్నిచోట్ల మెనూలో లోపాలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెనూ ప్రకారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్నిచోట్ల రిజిస్టర్‌లో ఉన్న దానికి భోజనం సమయానికి విద్యార్థుల సంఖ్యపై తేడా ఉన్న విషయాన్ని విలేకర్లు ఆమెతో ప్రస్తావించారు. పదిమంది అటు ఇటు సహజమే అని ఎక్కువ వ్యత్యాసం ఉన్నట్లయితే ఉపేక్షించేది లేదని అన్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వారిపై విచారణ జరిపించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబిసిడబ్ల్యూ బాలాజీ, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

డిబిసిడబ్ల్యూఒ నిర్మల జ్యోతి ప్రజాశక్తి వార్తకు స్పందన


వరద బాధితులకు అండగా 'మేము సైతం'



సిఎంకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



నిత్యావసరాలు అందజేస్తున్న ముదిగుబ్బ వాసులు



టిడిపి నాయకులకు చెక్కు అందజేస్తున్న హిందూపురం ఆర్పీలు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీసత్యసాయి జిల్లాలోని ఆయా మండలాల ప్రజలు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు, స్వచ్ఛందసంస్థలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లోని ప్రజలు తమవంతు సాయం అందించారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి - మడకశిర

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తనవంతు సాయం చేశారు. ఈ మేరకు రెండు లక్షల రూపాయల విలువైన చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందజేశారు. విజయవాడలోని 55వ డివిజన్ కు వరద బాధితుల ఆదుకోవడానికి ఎంఎస్ రాజును ఇన్‌ఛార్జిగా నియమించడంతో అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తన వంతుగా వరద బాధితులను ఆదుకోవడానికి రెండు లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

వెల్డింగ్ షాప్ యజమాని...

ముదిగుబ్బ : విజయవాడ వరద బీభత్సాన్ని చూసి సాటి మనిషిగా ఒక ముదిగుబ్బ మండలానికి చెందిన సామాన్య వెల్డింగ్ షాప్ ఓనర్ రమేష్ బాబు చలించిపోయాడు. తానే స్వయంగా తన శక్తికి మించి రూ.2.50 లక్షల విలువైన నిత్యావసర సరుకులు వెంటబెట్టుకుని విజయవాడ చేరుకొని తన స్నేహితులు సంజీవులు, మూషి , కుల్లాయప్ప, గోవింద్ రెడ్డి, తరుణ్, వంశీ , సునీల్ సహకారంతో వరద బాధితులకు అందజేశారు. రమేష్ బాబు మానవత్వాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో...

పుట్టపర్తి రూరల్ :విజయవాడ వరద బాధితులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారనిసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మంగళవారం సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ప్రత్యేక సహాయ కార్యక్రమాలు కొనసాగాయి. సహాయ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఈ ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి రఘుపాత్రుని లక్ష్మణరావు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా ఇప్పటివరకు అందించిన సహాయ కార్యక్రమాల గురించి వివరించారు. ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ నేతృత్వంలో ఇప్పటికే తాగునీరు, నిత్యావసర వస్తువులను అందించామన్నారు. పాలు, బ్రెడ్, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు కొవ్వొత్తులు అందజేస్తున్నామన్నారు. బియ్యం, చెరకు, మంచినూనె, పంచదార, చింతపండు మొదలైన నిత్యావసర వస్తువులతో కూడిన 20 రకాలకు చెందిన ఏడు వేల అమృత కలశాలను ఏర్పాటు చేయనున్నట్లు సిఎంకు వివరించారు. వీటిని సత్వరమే పంపిణీ చేయనున్నామని తెలిపారు. దీంతో ట్రస్టు చేస్తున్న సేవలను సిఎం చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్ర సాయి, రాష్ట్ర సేవా సమన్వయకర్త శ్యామ్ ప్రసాద్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో....

నల్లమాడ : విజయవాడ వరద బాధితుల కోసం నల్ల మాడ మండలంలో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు సరుకులు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా ఆదుకోవడానికి పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సుమారు వెయ్యి క్వింటాళ్ల బియ్యం, సరుకులు, దుస్తులు సేకరించి వరద బాధితులను ఆదుకుంటామని పేర్కొన్నారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గ ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలే శివశంకర్, మంజునాథ్ రెడ్డి, రామచంద్ర , బుట్టి డాక్టర్ నాగభూషణం, సలాం ఖాన్ , బాబా వలి, మస్తాన్ , రాయుడు , అబ్బాస్ , రషీద్, శివారెడ్డి, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల ఆర్పీలు...

హిందూపురం : విజయవాడ వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహకారంగా హిందూపురం పట్టణంలోని స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్లు ముందుకు వచ్చారు. బాధితులను ఆదుకోవడంలో భాగంగా రూ. 40 వేల విలువైన చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ డి.ఇ.రమేష్ కుమార్, కౌన్సిలర్లు సతీష్, దుర్గా మంజుళకు అందజేసి వరద బాధితుల సహాయ నిధికి జమ చేయాలని కోరారు. పట్టణ మెప్మా ఆర్పీల అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం తరపున ఈ ఆర్థిక సహకారం అందించినట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీల అసోసియేషన్ అధ్యక్షులు నాగలక్ష్మి, కార్యదర్శి ఆసియా భాను, కోశాధికారి ఆయిషా, నాయకురాళ్లు రాధిక, స్వప్న, దిల్షాద్, సల్మా, బంతి లత, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

లేపాక్షి: మండల పరిధిలోని సడ్లపల్లికి చెందిన శ్రావణి (24)అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు శ్రావణి మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయం లో చున్నీ తో ఫ్యాన్ కి ఉరివేసుకుని మృతిచెందింది. మృతురాలికి నాలుగు సంవత్సరాల కొడుకు, 8నెలల కూతురు ఉంది. శ్రావణి భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివాహిత మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

అనంతపురం- కదిరి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. మండలంలోని యర్రాయపల్లికి చెందిన కమతం వెంకటనారాయణ (55) మంగళవారం రాత్రి అనంతపురం నుండి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. మండల పరిధిలోని యర్రాయపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వెంకటనారాయణ ప్రమాదస్థలంలోనే మృతిచెందాడు. మరో ఐదు నిమిషాలలో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రమాద స్థలం వద్ద చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి. మృతుడు వ్యవసాయంపై ఆధారపడి జీవించేవాడు. సంఘటన ప్రదేశం ఇటుకలపల్లి, బత్తలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధి మధ్యలో ఉండడంతో ఇరు పోలీస్ స్టేషన్ల సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలం ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడంతో ఇటుకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని మరవకొత్తపల్లి గ్రామ సమీపంలో ఆరుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి మరవకొత్తపల్లి శివార్లలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొన్నామని ఎస్ఐ మునీర్ అహ్మద్ చెప్పారు. వారి వద్ద నుండి రూ.5160 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

ప్రజాశక్తి- పరిగి

మండలంలోని మోద పంచాయతీ కోనాపురానికి చెందిన వికలాంగ రైతు రాజకుమార్‌కు చెందిన మొక్కజొన్న పంటను దుండగులు ధ్వంసం చేశారు. రైతు రాజకుమార్ గ్రామంలో గతంలో యానిమేటర్ విధులు నిర్వహించేవాడు. ప్రస్తుత ప్రభుత్వంలో యానిమేటర్‌గా ఇతడిని తొలగించారు. తన పోస్టు తనకు ఇవ్వాలనే పలుమార్లు నాయకుల వద్ద అధికారుల వద్దకు రాజకుమార్ తిరిగారు. ఈ నేపథ్యంలో తనంటే గిట్టని వారు తాను ఒకటిన్నర ఎకరా పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ రంగడుకు ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన మొక్కజొన్న పంట

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంటలను సాగు చేసుకోని రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని జెడ్పీటీసీ కోటి సుధ. టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ గోడౌన్ నందు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ప్రభుత్వం 80 శాతం సబ్సీడీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఓబిరెడ్డి, నారాయణ స్వామి, చంద్రశేఖర్, నెట్టెం అశోక్‌నాయుడు, రమణ, సూరి, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - చిలమత్తూరు

జీవో నెంబర్ 85 ను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని పిహెచ్‌సి వైద్యులు తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు, వైద్యాధికారి, ఏపీపీహెచ్‌సి ఏడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. పి రామకృష్ణ మాట్లాడుతూ 85 జీవో వల్ల వైద్యుల మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతోందన్నారు. తమ పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఈ జీవోపై పునరాలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ఆందోళనలు ప్రారంభించామని, ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 16 నుండి నిరవధిక నిరాహారదీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. రెండు నెలలుగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలను ఇచ్చినా తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్. తేజశ్విని, డాక్టర్లు నికేష్, హర్షమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బత్తలపల్లి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సీడాప్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా నాలుగు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీవో ఆదెప్ప తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం, శ్రీసత్య సాయి ఎస్‌ఆర్టిపి స్కిల్ కాలేజీలో నిరుద్యోగ యువతీ యువకులకు రిటైల్ స్టోర్ డిపార్టుమెంటు మేనేజర్ కోర్స్, కంప్యూటర్ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం పథకమైన దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా శిక్షణ ఇచ్చి వారికి ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. శిక్షణలో భాగంగా ఉచిత యూనిఫారం,మెటీరియల్, భోజనవసతి కల్పించి శిక్షణ పూర్తి అయిన తరువాత వందశాతం ఉపాధి కల్పిస్తారన్నారు. మరిన్ని వివరములకు 8919574632 ఫోన్ నెంబర్‌లో జాబ్ కోఆర్డినేటర్ రామును సంప్రదించాలన్నారు.

జాబ్‌మేళాలో 43 మంది ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యతను పెంపొందించుకొని ముందుకెళ్లాలని స్థానిక ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరీష్ బాబు సూచించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 147 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో తొలుత 64 మందిని వివిధ కంపెనీల ప్రతి నిధులు ఎంపిక చేశారు. అయితే చివరగా జరిగిన ఇంటర్వ్యూలలో 43 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ హరీష్ బాబు మాట్లాడుతూ అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరై తమ ప్రతిభను కనబరిచిన అభ్యర్థులను వివిధ కంపెనీలు ఎంపిక చేసుకోవడం జరిగిందని, ఆయా కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరిన అభ్యర్థులు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు రమేష్ కుమార్, సతీష్ కుమార్, నైపుణ్యాభివృద్ధి, ఎంప్లాయిమెంట్ విభాగాల ఉద్యోగులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిగిలో 17 నుంచి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు

పరిగి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మండల స్థాయిలో పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ లక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే ఈ పోటీలపై మండల వ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులతో వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం పరిగిలో సమావేశం నిర్వహించారు. మండలంలో నిర్వహించే ఈ క్రీడలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించాలని వారిని ఎంఇఒ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ మండల కోఆర్డినేటర్ వెంకటేష్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీల్లో వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - మడకశిర

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండల పరిధిలోనిగౌడన హళ్ళి ప్రధానోపాధ్యాయుల పివి. నరేంద్రను యుటిఎఫ్ నాయకులు మంగళవారం సన్మానించారు. సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్న నరేంద్రను యూటీఎఫ్ మడకశిర జోన్ ఆధ్వర్యంలో ఆసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, మండల అధ్యక్షులు మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప తదతరులు పూలమాలలు శాలువాలతో సత్కరించి యూటీఎఫ్ మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరసింహమూర్తి, లక్ష్మీనారాయణ మూర్తి, ఎర్రమల, కవిత, అనురాధ, శివయ్య, ఫమీద, అరుణ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

పరిగి : పంటకోత ప్రయోగాల నిర్వహణపైఉపగణాంక అధికారి స్నేహ ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రసహాయకులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన తహశీల్దార్ హసీనాసుల్తాన్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మకు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

తెలంగాణ భూపోరాట ఉద్యమ నేత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు మంగళవారం ధర్మవరం రూరల్ పరిధిలోని గొట్లూరు గ్రామంలో ఘనంగా జరిగాయి. సత్యసాయి జిల్లా రజక అభివృద్ధి సంస్థ మండల శాఖ ఆర్గనైజేషన్ సెక్రటరీ అగ్రహారం ముత్యాలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఐలమ్మ చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర జెనరల్ సెక్రటరీ పి కమ్మన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ పార్వతి, పట్టణ అధ్యక్షులు నరసింహులు, శ్రీరాములు, శేఖర, రామాంజి, ఆదెప్ప, గంగాధర, వరలక్ష్మి, పద్మావతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు మండల కేంద్రంలోని కుమ్మరపేట ధోబి ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షులు జివి. రమణ , జిల్లా నాయకులు నారాయణ, ఉపాధ్యక్షులు కుమ్మరపేట రవి ఆధ్వర్యంలో మంగళవారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, పురుషోత్తం, రాంప్రసాద్, రాజు, వెంకటరమణ, ఆంజనేయులు, నారాయణ, వెంకటేష్ ,నారాయణ, వెంగముని పాల్గొన్నారు.

కదిరి టౌన్ : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతినికదిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కదిరి పట్టణంలోని సైదాపురం ధోబి ఘాట్ నందు ఐలమ్మకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బాపనపల్లి శ్రీనివాసులు, గంగన్న, నల్లబల్లె శివశంకర్, లలితమ్మ, శివప్ప, ఆదెప్ప, చారపల్లి రమణ, బి లక్ష్మీనారాయణ, నరసింహులు, కుటాగుళ్ళ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళి

నియోజకవర్గంలో రూ.23.31 కోట్లతో రోడ్డు పనులు

రాష్ట్ర బీసీ సంక్షేమ,చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ


పెనుకొండ నియోజకవర్గంలో రూ. 23.31 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ,చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెనుకొండ నియోజక వర్గంలో రూ.23.31 కోట్లతో 41.50 కిలో మీటర్లు నూతన రోడ్లు నిర్మించనున్నామని చెప్పారు. పెనుకొండ మండలంలో రూ.4.15 కోట్లతో 5.68 కిలో మీటర్ల మేర 40 రోడ్ల పనులను చేపడుతున్నామన్నారు. పరిగి మండలంలో రూ.4 కోట్లతో 9 కిలో మీటర్లు, సోమందేపల్లిలో రూ.4.37 కోట్లతో 8.41 కిలో మీటర్లు, గోరంట్లలో రూ.5.44 కోట్లతో 10.67 కిలో మీటర్లు, రొద్దం మండలంలో రూ.5.35 కోట్లతో 7.72 కిలో మీటర్లు నూతన రోడ్లు నిర్మిస్తామన్నారు. త్వరలోనే పనులు నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

నెరవేరనున్న పాతికేళ్ల రహదారి కల : రొద్దం నుంచి కందుకూర్లపల్లి మధ్య రహదారి నిర్మించాలని ఆ ప్రాంత వాసులు 25 ఏళ్ల నుంచి కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సవిత చొరవతో రొద్దం-కందుకూర్లపల్లి రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ రహదారికి 1.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. అదేవిదంగా రొద్దం మండలం పెద్దిపల్లి రోడ్డు, కంబాలపల్లి శ్మశానవాటిక ,పెనుకొండ మండలంలో మరువపల్లి రోడ్డు, చిన్నపరెడ్డిపల్లి కల్వర్టు రూ. 25 లక్షలతో నిర్మిస్తున్నామని చెప్పారు.

మొక్కలు నాటే కార్యక్రమానికి కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టరు టీఎస్ చేతన్‌కు ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్‌ను ఆహ్వానిస్తూ పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ ఈనెల 17న జిల్లాలోని పరిగి మండలం ధనాపురం గ్రామంలో వెయ్యి మంది విద్యార్థుల చేత మొక్కలు నాటించనున్నామని ఆ కార్యక్రమానికి కలెక్టర్ ను ఆహ్వానించామని చెప్పారు. ఇప్పటికే తమ సంస్థ సుమారు ఐదు లక్షల మొక్కలు నాటించి రక్షించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. చట్టవిరుద్ధంగా ఎక్కడైనా వృక్షాలు నరికే వారిని అడ్డుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల ప్రకృతి పరిరక్షణ సంస్థ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర రాజు, సభ్యులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

14 నుంచి 'స్వచ్ఛత' కార్యక్రమాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఈనెల14 నుంచి అక్టోబర్ 1 వ తేదీ వరకు స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛత పేరుతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీ ఎస్ చేతన్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 14వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించాలని అలాగే 14 వ తేదీ నుండి 17వ తేదీ వరకు సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇందులో భాగంగా ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈనెల 17వ తేదీ నుంచి సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం కింద అన్ని మున్సిపాలిటీలలో, అన్ని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహించి శ్రమదానం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, రైల్వేస్టేషన్లు, చెత్త కుప్పలు, కుళాయిల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాలలో మెగా శుభ్రత డ్రైవ్‌లు రెండు వారాలపాటు నిర్వహించాలన్నారు. ఈ విషయమై ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు , విస్తరణాధికారులతో పాటు సంబంధిత అధికారులు గ్రామ స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని డిపిఒ, జెడ్పీ సిఇఒ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలను కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యంగా ఉండాలని, ప్రభుత్వ భవనాలపై మంచి రంగులు వేయించాలని అన్నారు. వ్యక్తిగత ఆసక్తితో ఈ కార్యక్రమాలు చేపట్టాలని, ఆయా శాఖల వాట్సాప్ గ్రూప్ లలో కార్యక్రమాలు నిర్వహించి ఫోటోలను పంపించాలని చెప్పారు. సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించాలన్నారు. వర్షాలు రావడంతో క్షేత్రస్థాయిలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవోలు మానిటర్ చేయాలని ఆదేశించారు.

పివికెకెకు పదేళ్లపాటు 'అటానమస్ స్టేటస్'

ప్రజాశక్తి - అనంతపురం

పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పదేళ్లపాటు అటానమస్ స్టేటస్ లభించినట్లు కళాశాల ఛైర్మన్ పల్లె కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పివికెకె ఇప్పటికే ఎన్‌బిఎ, ఎన్ఎఎసి గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుతం పదేళ్లపాటు అటానమస్ స్టేటస్ పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ గొప్ప విజయాలకు సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ అధ్యయనంలో నైపుణ్యాల పెంపు, పరిశోధన రంగంలో భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే సంవత్సరాల్లో పీవీకేకే ఐటీ మరింత గొప్ప మరింత విద్యాసంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పల్లె రఘునాథరెడ్డి, కోశాధికారి పల్లె సింధూర, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఎఒ మనోహర్‌రెడ్డి, డిప్లొమా ప్రిన్సిపాల్ వైభవ్, శ్రీబాలాజీ పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మదేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శంకరనారాయణ

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని బీదానపల్లిలో రెండు రోజుల క్రితం వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన దాడి జరిగింది. ఈ దాడిలో వైసిపి సోషల్ మీడియా కార్యకర్త కురుబ ప్రభాకర్ ఇంటిపై టిడిపికి చెందిన కొంతమంది రాళ్లదాడి చేసిన విషయం మండల నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ మంగళవారం బాధితుడుని పరామర్శించారు. గ్రామానికి వెళ్లి ప్రభాకర్‌ను, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందనిభరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండలంలోని వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ ఉజ్జినప్ప, స్టేట్ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, తురకల పట్నం రాజారెడ్డి, మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ మారుతి రెడ్డి, పెనుకొండ మునిసిపల్ చైర్మన్ ఫారుక్,పెనుకొండ ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ కురుబ రామాంజనేయులు, సర్పంచులు రామకృష్ణ, సోమిరెడ్డి, గంగన్న, ఎంపీటీసీలు వెంకటేష్, ఎల్లప్ప, ఎల్బీజీ నగర్ ప్రసాద్, కురుబ సాలప్ప తదితరులు పాల్గొన్నారు.

స్థలం వివాదాన్ని పరిష్కరించండి

ప్రజాశక్తి- పరిగి

మండలంలోని పైడేటిలో దళితుల సాగు కోసం కేటాయించిన స్థలాన్ని వారికి అప్పజెప్పి వారికి హక్కు కల్పించాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం పరిగి తహశీల్దార్ హసీనా సుల్తానాను కలిసి సమస్యను వివరించారు. దళిత కాలనీలలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ స్థలంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సరస్వతి కలిసి ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీచిగానిపల్లి రామాంజినప్ప, కాలనీ వాసులు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న నాయకులు